www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 01 | జూలై | 2026 పేజీలు : 8

## సైద్ధాంతిక రాజకీయ శిక్షణా తరగతులు

**-ప్రారంభించనున్న కూనంనేని**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు జూలై ఏడు నుంచి తొమ్మిది వరకు భద్రాచలంలో నిర్వహించనున్నట్లు సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి స్థాయి సభ్యుల శిక్షణా తరగతులు ఏడవ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని తరగతులను ప్రారంభించి ప్రస్తుత రాజకీయ పరిస్థితి, పార్టీ కర్తవ్యంపై కూనంనేని సాంబశివరావు బోధిస్తారని పాషా తెలిపారు. ఏడవ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు మార్క్సిజం సమకాలిన సమాజంలో దాని ప్రాధాన్యత అనే అంశాన్ని ప్రొ॥ యుగల్ రాయులు, ఆర్థిక సంక్షోభంలో భారతదేశం పర్యవసనాలు అనే అంశాన్ని మోహన్‌రెడ్డి బోధిస్తారని తెలిపారు. ఎనిమిదిన భారతీయ చరిత్ర, సంస్కృతి ఆర్‌ఎస్‌ఎస్ వక్రీకరణ అనే అంశాన్ని సోమసుందర్, పార్టీ కార్యక్రమాన్ని యుగల్ రాయులు, మతోన్మాదం హిందుత్వ ఎజెండా అనే అంశాన్ని వేణుగోపాల్, సిపిఐ ఎదుర్కొంటున్న సవాళ్లు అధిగమించే మార్గాలు కె. శ్రీనివాసరెడ్డి బోధిస్తారని పాషా తెలిపారు. తొమ్మిదిన భారత కమ్యూనిస్టు పార్టీ విప్లవోద్యమ చరిత్ర అనే అంశాన్ని చలసాని వెంకట్రామారావు, విప్లవ పార్టీ ఆవశ్యకత ప్రజా సంఘాల నిర్మాణం అనే అంశాన్ని బాగం హేమంతరావు బోధిస్తారని సాబీర్‌పాషా తెలిపారు.

# ఎసిబిని ఆశ్రయించడమే మార్గమా..?

**-కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ**
**-పంపకాల పనిలో కొందరు అధికారులు**
**-శాఖపరమైన విచారణలు.. శూన్యమైన చర్యలు**





**ప్రజాపక్షం/ఖమ్మం :** ఏదో ఒక రూపంలో ఎంతో కొంత సమర్పించుకోనిదే ప్రభుత్వ కార్యాలయాల్లో పని జరగడం లేదన్నది జగమెరిగిన సత్యం. అక్రమమైనా, సక్రమమైనా అధికారులను తృప్తి పర్చకుండా పని జరగడం లేదు. ఉన్నతాధికారులు అంతా తెలిసి మిన్నకుండడంతో బాధితులు అవినీతి నిరోధక శాఖ(ఏసిబి)ని ఆశ్రయిస్తున్నారు. ఏసిబి అధికారులు దాడి చేసి లంచవతారులను పట్టుకుంటే తప్ప ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు ఆగడం లేదు. కొన్ని కార్యాలయాలు ప్రత్యేకించి కొన్ని శాఖల్లో డిమాండ్ చేసి వసూళ్లు చేయడం హక్కుగా మారింది. లంచం అడిగే విషయం, తీసుకునే విషయం ఉన్నతాధికారులకు తెలిసినా కొందరు ఫిర్యాదు రాలేదు మాకు అంటారు. ఒకవేళ ఫిర్యాదు చేస్తే విచారణ జరుపుతున్నామంటారు. ఆ విచారణ ఎప్పటికి తెగుతుందో, ఎప్పటికీ చర్యలు తీసుకుంటారో ఎవరికి అర్థం కాదు. మొన్నటి గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఏసిబికి చిక్కిన నిన్నటి నీటిపారుదల శాఖలోని ఇంజనీరింగ్ అధికారి అయినా వసూళ్ల బాగోతం ఆయా శాఖల ఉన్నతాధికారులకు తెలియదని ఎవరైనా అనుకుంటే పొరపాటే. పని చేయాలని అనుకున్నప్పుడే మాముళ్లు అడుగుతూ అందులో ఎవరి వాటా ఎంతో చెప్పి వసూలు చేస్తున్నారు అధికారులు. ఒకప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అవినీతి అధికారులు పని చేయాలంటే వణికి పోయే వారు. అప్పటి ఖమ్మం జిల్లాకు బదిలీ అయితే సెలవు పెట్టడమో లేదంటే తిరిగి బదిలీ చేయించుకుని వెళ్లిపోవడమో జరిగేది. కానీ ఎందుకో ఇప్పుడు అవినీతి అధికారులకు ఉమ్మడి ఖమ్మం జిల్లా అడ్డగా మారిందన్న ఆరోపణలు

మిగతా 2లో..

## భారీ గంజాయి రాకెట్ గుట్టురట్టు



**-ఈగల్ ఫోర్స్ మెరుపు దాడులు**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రాష్ట్రంలో మాదక ద్రవ్యాల రవాణాపై ఈగల్ ఫోర్స్ పోలీసులు చేపట్టిన వరుస మెరుగు దాడుల్లో భారీ స్థాయిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అత్యంత

మిగతా 2లో..

## ఏరువాక సాగలే..!



**- దుక్కులుదున్ని దిక్కులు చూస్తున్న అన్నదాత**
**- నీటి చుక్కకోసం ఆశగా ఆకాశం వైపు**
**- జిల్లాలో లోటు వర్షపాతం నమోదు**
**- వెంటాడుతున్న ఎల్‌నినో ఆందోళన**
**- ప్రత్యామ్నాయమే మేలు**

2లో..

## దశాబ్దాల సమస్యలకు శాశ్వత పరిష్కారం



**-ప్రతీ గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తాం**
**-అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దు**
**-అభివృద్ధి పనులను ప్రారంభించిన కూనంనేని**

**ప్రజాపక్షం/పాల్వంచ :** దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్నటువంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేంత వరకు విశ్రమించబోనని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు అన్నారు. మంగళవారం మండల పరిధి దంతెల బోర ఎస్‌సి కాలనీలో పూర్తి అయిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం నాగారం ఎస్‌సి కాలనీలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. సమస్యలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకొనేందుకు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ తనను నమ్మి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలు ఆశించిన అభివృద్ధి చేయటమే లక్ష్యమన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి చేసి కొత్తగూడెం నియోజక వర్గాన్ని ఆదర్శంగా నిలిపేందుకు నిరంతరం శ్రమిస్తున్నానని అన్నారు. సుధీర్ఘ కాలంగాప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అడుగులు

మిగతా 2లో..

# ఎసిబిని ఆశ్రయించడమే మార్గమా..?



(మొదటిపేజీ తరువాయి)
వినవస్తున్నాయి. ఏదో ఒక శాఖలో తిరుగుతూ ఇక్కడే ఉద్యోగం చేయడం ఎవరికి వెరవక అందిన కాడికి పోగేసుకోవడం చేస్తున్నారు. జిల్లాను మాత్రం వదలడం లేదు. ఇక కొందరు అధికారులైతే రాజకీయ నాయకుల అండతో ఒక రకంగా కొన్ని శాఖలను తోకను తలనాడించిన విధంగా శాసిస్తున్నారు.

### చ్యలపై జంకేందుకు...?

ప్రభుత్వ కార్యాలయాల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ శాఖ ఆ శాఖ అనేది లేకుండా అన్ని శాఖల్లోనూ ఇదే తీరు. ఏదో ఒక రకంగా మాముళ్లు పుచ్చుకోకుండా పని జరిగిన సందర్భం లేదు. ఒక వేళ మాముళ్లు ఇచ్చుకోలేకనో లేదా ఇవ్వడం ఇష్టం లేకనో పనిచేయించుకోవాలని భావిస్తే రకరకాల కొర్రీలు పెడుతుంటారు. కంప్యూటర్లు పని చేయడం లేదని, యాప్ ఓపెన్ కావడం లేదని, ఇతర డ్యూటీ పేర్లు చెప్పి నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో ఉన్నతాధికారులను చూసి లేదా వారి పేరు చెబితేనే భయపడి పనులు చేసే క్షేత్రస్థాయి ఉద్యోగులు లేరంటే అతిశయోక్తి కాదు. గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామంటే చాలు ఏదో ఒక రకంగా పనిచేసే వారు. ఇప్పుడు ఆ మాట అంటే చెప్పుకోపో అంటూ ముఖం మీదే కాగితాలు విసిరేస్తున్నారు. అందరి సంగతి మాకు తెలుసంటూ ఎదురు దాడి చేస్తున్నారు. అయినా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తద్వారా మండల కార్యాలయాలు లేదా ఇతర కార్యాలయాల్లో పని చేయించుకున్న నాధుడు లేదు. ఏసిబిని ఆశ్రయించి లంచవతారులను పట్టిస్తే తప్ప ఒక్క అవినీతి అధికారి పైనా అయినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల మొదలు బహిరంగంగానే వసూళ్లకు పాల్పడుతున్నా ఎందుకు మౌనంగా ఉంటున్నారో, చర్యలకు ఎందుకు జంకుతున్నారో అర్థం కావడం లేదు. చర్యలపై జంకుకు క్షేత్రస్థాయి అధికారులు చెప్పే వాటాలే కారణమా అన్నది కూడా తేలాల్సి ఉంది.

### బాధితులకు మాముళ్లు ఇవ్వడం నేర్పుతున్నారు...

ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి పని మీద వస్తే నయా పైసా ఖర్చు లేకుండా పని జరిగే పరిస్థితి లేదు. ఎవరికైనా సార్ ఈ పని చేయండి అంటే ఓ నవ్వు నవ్వి పైసలు లేకుండా పనులు అవుతాయా అంటూ హేళన చేస్తున్నారు. ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రజలను లంచాలు ఇవ్వడానికి అలవాటు చేస్తున్నారు.

### పైరవీకారుల జోరు..

ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు పైరవీకారుల జోరుతో కళకళలాడుతున్నాయి. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పైరవీకారులు లేకుండా పనులు జరిగే పరిస్థితి లేదు. గతంలో రాజకీయ నాయకులు ప్రజల పక్షాన నిలిచి అధికారులతో చెప్పి పనులు చేయించే వారు. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో పైరవీకారులంతా రాజకీయ నాయకులే. ఇందులో అధికార పార్టీ నేతలే ఎక్కువ. తమ మద్దతుదారులు లేదా తమ అనుచరులకు పనులు చేయించి మెప్పు పొందాల్సిన రాజకీయ నాయకులు ప్రతి పనికి ఓ రేటు కట్టి దానిలో నీకింత నాకింత అన్నట్లుగా పంచుకుంటున్నారు. పైరవీకారుల ఆటకట్టిస్తే కొంత మేర ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు మేలు జరుగుతుంది. పైరవీకారులే వసూళ్లు చేయడం, అధికారులకు ముట్టజెప్పుతుండడంతో ఏమి చేయలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. మొత్తంగా అవినీతికి అడ్డాలుగా మారిన ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సి ఉంది. ఈ శాఖ ఆ శాఖ అనే బేధం లేకుండా అన్ని శాఖల ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాల్సి ఉంది. ఆయా కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైల్స్ వాటి వివరాలకు సంబంధించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తూ ఉన్నతాధికారుల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేదంటే ప్రత్యక్షంగానో పరోక్షంగానో లంచానికి లైసెన్స్ ఇచ్చినట్లు అవుతుంది.

# ఏరువాక సాగలే..!

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** పౌర్ణమి పోయినా ఏరువాక పనులు ఇంకా మొదలు కాలేదు. మృగశిర కార్తెలు దుక్కులు దున్నిన రైతులు దిక్కులు చూస్తున్నారు. ఎల్‌నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయనే వార్తలతో రైతుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. వాస్తవానికి నైరుతి రుతుపవనాల రాక జూన్ ద్వితీయ, తృతీయ వారాల్లో మొదలై సెప్టెంబర్ మొదటి పక్షంతో ముగుస్తుంది. రుతుపవనాలు ప్రభావం కనిపించినప్పటికీ ఆశించిన స్థాయిలో వానలు పడక భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. నైరుతీ ప్రభావం ఉన్నప్పటికీ జిల్లాలో గడిచిన జూన్ నెల్లో సగటు వర్షపాతం నమోదైంది. గత ఏడాది జూన్ 30 వరకు 175.02 మి.మీ వర్షపాతం నమోదు కాగా ఈ సారి 161.7 మిమీటర్ల మాత్రమే కురిసింది. వాస్తవానికి సగదున 228.05 మిమీటర్ల వర్షపాతం పడాల్సుంది.

**దుక్కులు దున్ని దిక్కులు చూస్తూ ..**

వ్యవసాయ పనుల కోసం దుక్కులు దున్నిన రైతన్నలు వానలు లేక దిక్కులు చూస్తున్నారు. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఈ వానా కాలంలో 6 లక్షల 37వేల 800 ఎకరాల్లో సాగు చేయనున్నారు. ఇందులో వరి 1 లక్ష75 వేల ఎకరాలు, పత్తి 2 లక్షల 10 వేల ఎకరాల్లో సాగు అంచనాలు ఉన్నాయి. వాస్తవానికి ఇప్పటికే పత్తి గింజలు విత్తాల్సి ఉన్నప్పటికీ సాగుభూమి తడిసి విత్తులు విత్తేంత వర్షం కూడా పడక పోవడంతో ఆ పనులు ముందుకు సాగలేదు. మరో ప్రక్క వరి నాట్లు కూడా వేయలేదు. ఇప్పటికే ముమ్మరంగా వరినాట్లు వేసి జూలై ద్వితీయపక్షంలో నాటేందుకు సిద్ధం చేస్తారు. కానీ అటు వరినాట్లు గానీ, ఇటు పత్తివిత్తనాలు విత్తే పనులు మొదలు కాకపోవడంతో అదును సమయానికి పరిస్థితులు అనుకూలిస్తాయా అనే అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరి, పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతన్నలు నీటి చుక్కకోసం ఆకాశం వైపు ఆశాగా ఎదురు చూస్తున్నారు.

**ఎల్‌నినో ఆందోళన :** దేశవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు ఆందోళన కలిగించేవిగా ఉంటాయనే ఆశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతున్నలు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్‌నినో ప్రభావం వేసవి చివరలో తీవ్రంగా కనిపించింది. వర్షా కాలంలో కూడా ఆ ప్రభావం బలంగా ఉంటుందనే వార్తలు వినిపిస్తున్నాయి. సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉంది. వరి,పత్తి,మిర్చి, మొక్కజొన్న పంటలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు, ఉష్ణోగ్రతల్లో మార్పులు సంభవించి నెలలో తేమ శాతం తగ్గే ప్రమాదం. తగినంత వర్షపాతం లేకపోవడంతో చెరువులు, వాగులు, కుంటలు, ప్రాజెక్టులు నిండే అవకాశం తక్కువ. దీంతో సాగునీటి ఇబ్బందులు తలెత్తుతుందని వ్యవసాయ నిపుణులు, వాతావరణ పరిశోధకులు భావిస్తున్నారు. అయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ ప్రాంతాలు ఎక్కువగా ఉండటం,గోదావరి నది ప్రభావం వల్ల పరివాహక ప్రాంతాల్లో ఎల్‌నిన్ ప్రభావం కొంత మేరకు తగ్గే అవకాశాలు ఉంటాయని భావిస్తున్నారు.

**ఇలా చేస్తే మేలు :** ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్దతులు పాటిస్తే మేలను వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ఆరుతడి పంటలపై అధిక దృష్టి సారించాలి. వర్షపునీటి చుక్కని ఒడిసిపట్టి జాగ్రత్త చేసుకుంటే మేలని, నేల తేమను కాపాడే పద్దతులను పాటించడం ఎంతో మంచిదని చెబుతున్నారు. వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆరుతడి పంటల వైరు రైతులు మొగ్గు చూపాలని స్వయంగా తెలిపగా, జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ప్రత్యేక కార్యచరణ చేపడుతూ రైతులకు వివరిస్తున్నారు.

# ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** గ్రామాలలో అవసరమైన ప్రాధాన్యతా క్రమం లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపిడిఓ పి. రాజారావు అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై ఒక రోజు శిక్షణ మంగళవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలను నిర్వహించి ప్రాధాన్యత కలిగిన పనులను గుర్తించాలన్నారు.ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత సిసి రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాలు, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, మహిళ, బాలల సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యత కల్పించాలని చెప్పారు. గ్రామ సభల ద్వారా ప్రజల సూచనలు, అవసరాలను గుర్తించి అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ వార్షిక ప్రణాళిక రూపొందించాలని, గ్రామాల సమగ్ర అభివృద్దే జిపిడిపి ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనంతరం జిపిడిపి పోర్టల్ వినియోగం, గ్రామ స్థాయి డేటా నమోదు, ప్రణాళికల రూపకల్పన, అమలు విధానం, ప్రభుత్వ మార్గదర్శకాలపై పంచాయితీ అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ గంజాయి రాకెట్ గుట్టురట్టు

(మొదటిపేజీ తరువాయి)
వేగంగా వ్యూహాత్మకంగా నిర్వహించిన ఈ ఆపరేషన్లు అంతరాష్ట్ర గంజాయి రాకెట్‌పై కీలక దెబ్బగా నిలిచాయి. తాజా ఘటనలో బూర్గంపాడు మండలం సారపాక సమీపంలో కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 525 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడి ఈగల్ ఫోర్స్, స్థానిక పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో జరిగింది. ఈ గంజాయి విలువ సుమారు కోట్ల రూపాయలుగా అంచనా వేయబడింది. అంతకు ముందు నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లలో కూడా ఈగల్ ఫోర్స్ కీలక విజయాలు సాధించింది. ఒడిశా నుంచి తెలంగాణ మీదుగా రహస్యంగా తరలిస్తున్న సుమారు రూ 2.5 కోట్ల విలువైన 500 కిలోల గంజాయిని పోలీసులు సరిహద్దు ప్రాంతాల నుంచి 80కిలోల మీటర్ల మేర ఛేజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈఘటనలో ముఠా కదలికలను గమనించి సమయోచితంగా చర్యలు తీసుకోవడం ద్వారా పెద్ద నెట్‌వర్క్‌ను భగ్నం చేశారు. ఈగల్ ఫోర్స్ అధికారులు అత్యంత వేగంగా స్పందిస్తూ, ఆధునిక సాంకేతిక, గూఢచారి సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. వరుస విజయాలతో మాదకద్రవ్యాల రవాణా ముఠాలకు పెద్ద ఎదురు దెబ్బ తగిలినట్లయింది. పట్టుబడిన కేసులపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని, అంతరాష్ట్ర నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

# దశాబ్దాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)
వేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో, ప్రతీ బస్తీని పక్కా రహదారుల, డ్రైనేజిల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వివిధ పథకాలు, గ్రాంట్ల ద్వారా ఇప్పటికే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. మరికొన్ని పనులకు సంభందించి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు.మారుమూల గ్రామాలు, గిరిజన గుంపులను మరింత అభివృద్ధి చేసి చూపెడతానని, సమిష్టి కృషి నిర్ణయాలతో నియోజక వర్గంలో సమస్యలను పరిష్కరించుకొందామని, అభివృద్ధిలో ఆదర్శవంతమైన నియోజక వర్గంగాతీర్చి దిద్దుకుందామని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అను నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ కార్యదర్శి, కార్పోరేటర్ అడుసుమిల్లి సాయిబాబ, ఎంపిడిఓ రాజారావు, పిఆర్ డిఈ రాజశేఖర్, పిఆర్ ఏఈ శ్రీనివాసరావు, పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సురేష్, సర్పంచ్ సోడె వెంకటరమణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు నిమ్మల రాంబాబు, నాగారం ఉప సర్పంచ్ బానోత్ రంజిత్, చంచలపురి శ్రీనివాస్, సాయిలి శ్రీను, వెంకన్న, మేక రాంబాబు, ప్రశాంత్, ప్రేమ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు విద్యా సామగ్రి పంపిణీ




**ప్రజాపక్షం/వైరా:** వెలిశెట్టి నర్సింహారావు బాల్యమిత్రుడు హైదరాబాద్ డిఆర్‌డివోలో అబ్దుల్ కలాం మిస్సైల్ కాంప్లెక్స్‌లో సైంటిస్ట్‌గా పనిచేస్తున్న సుందర్ నేతృత్వంలోని అప్నా పరివార్ స్వచ్ఛంద సంస్థ ద్వారా వైరా ఫిషరీస్ కాలనీ పాఠశాలకు రూ.14వేలు విద్యా సామాగ్రి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, ఏడో వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు, ఏఏపిసి చైర్మన్ ఆది రజని ఆధ్వర్యంలో పిల్లలందరికి విద్యా సామాగ్రి పంచిపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏడో వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు మాట్లాడుతూ ఎక్కడో హైదరాబాద్‌లో ఉన్న వ్యక్తుల అప్నా పరివార సంస్థ మా పాఠశాలకు ఈ రకంగా విద్యా సామాగ్రి పంపిణీ చేయడం అనేది వారి ఉదార స్వభావానికి నిదర్శంన అని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయుల చాలా చక్కగా విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ పాఠశాలకు అనేక మౌలిక వసతుల ధాతల ద్వారా సమకూర్చుతున్నారని, ప్రతి కార్యక్రమంలో తనని ఇవ్వాల్వ్ చేస్తున్నారని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలిశెట్టి నర్సింహారావు తన మిత్రుల ద్వారా పాఠశాలకు అనే మౌలిక వసతులు సమకూర్చుతున్నారని, అందులో భాగంగానే హైదరాబాద్ డిఆర్‌డివో అబ్దుల్ కలాం మిస్సైల్ కాంప్లెక్స్‌లో సైంటిస్ట్‌గా పనిచేస్తున్న వెలిశెట్టి నర్సింహారావు బాల్యమిత్రుడు సుందర్ నేతృత్వంలోని అప్నా పరివార్ సంస్థ ద్వారా ఈ పాఠశాలకు విద్యా సామాగ్రి సమకూర్చుకోవడం అభినందనీయం అని, ధాతలకు అభినందనలు తెలిపారు. ఏఏపిసి చైర్మన్ ఆది రజని మాట్లాడుతూ ఈ పాఠశాలకు ఉపాధ్యాయులు వచ్చిన తర్వాత పాఠశాల విద్యార్థుల్లో పాఠశాలలో చాలా మార్పులు వచ్చాయని పిల్లలు కూడా పాఠశాలలో పెరిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, ఏడో వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు, ఏఏపిసి చైర్మన్ ఆది రజని, ప్రధానోపాధ్యాయులు వెలిశెట్టి నర్సింహారావు, ఉపాధ్యాయులు బీరెల్లి రామకృష్ణ, కృష్ణవేణి, విద్యార్థుల తల్లిదండ్రులు, సంగెపు వెంకన్న, నరేష్, హుసేన్‌బి, రమేష్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కలశాభిషేకం



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర ఆలయంలో మంగళవారం మహా కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7గంటలకు చతుర్వేద పారాయణ, స్థానములు నవగ్రహ హోమంలు అనంతరం శ్రీ పద్మావతి, శ్రీ అలివేలు మంగమ్మ అమ్మవార్లకు అష్టోత్తర కలాభిషేకం నీరాజన మంత్ర పుష్పముల కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు మన్యసూక్త హోమం, మూల మంత్ర హోమం నిర్వహించారు. ఈ మేరకు మధిర సీఐ మధుయ ఆధ్వర్యంలో ఎర్రుపాలెం ఎస్సై రమేశ్, సిబ్బంది భారీ బందోభస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహన ధర్మకర్త ఉప్పల విజయ దేవశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, వకుల మాత స్టేడియం నిర్మాణదాత తుళ్లూరు కోటేశ్వరరావు, సర్పంచి తుల్లూరి నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**-జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సాంప్రదాయ పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా ఉద్యాన అధికారి ఎంవి మధుసూదన్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని లచ్చిరాంతండా గ్రామంలో 45 ఎకరాల్లో చేపట్టిన ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ పాల్గొని మొక్కను నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి కాకుండా ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ పామ్‌ను వేయాలని కోరారు. ఆయిల్ పామ్‌లో అంతర్ పంటలు కూడా సాగు చేసుకోవచ్చునని తెలిపారు. ఆయిల్ పామ్ పంటకి కోతుల వల్ల కానీ, ప్రకృతి వైపరీత్యాల వల్ల కానీ ఎలాంటి హానీ లేదన్నారు. ఒకసారి నాటితే 30 ఏళ్ల పాటు ఆదాయం ఇస్తుందన్నారు. మార్కెట్ సౌకర్యం



ఉన్న పంట అని తెలిపారు. ఆయిల్ పామ్ పంట వేసుకుంటే ప్రభుత్వం ఒక ఎకరాకు రూ. 51,000 రాయితీ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి నగేష్, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, గోద్రెజ్ ఫీల్డ్ ఆఫీసర్ చందు, రైతులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణపై ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సమీక్షించారు. మంగళవారం కార్పోరేషన్ కార్యాలయంలో సర్ కార్యక్రమంపై కమిషనర్ ఏఈఆర్‌వోలతో సమీక్ష నిర్వహించారు. ఎన్యుమరేషన్ ఫారాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో పది శాతం ఫారాల పంపిణీ పెండింగ్‌లో ఉందని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రేపటి నుంచి ఫారాల సేకరణ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. మ్యాపింగ్ కానీ, ఓటర్ల జన్మతేదీ ధృవీకరణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 పత్రాల్లో ఏదైనా ఒకటి సిద్ధంగా ఉంచుకునేలా బిఎల్‌వోలు అవగాహన కల్పించాలన్నారు. ఫారాలు సేకరించే సమయంలో వాటిని పూర్తిగా నింపబడినాయా లేదా అనే అంశాన్ని తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏఈఆర్‌వోలు సూపర్‌వైజర్లు ,బిఎల్‌వోలకు నిరంతరం మార్గనిర్దేశం చేస్తూ పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు.

# రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందించాలని వినతి

**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందించాలని ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, మాట్లాడుతూ..యూరియా కోసం ఆన్‌లైన్ యాప్‌తో సంబంధం లేకుండా, గతంలో ఉన్న పద్ధతే రైతులకు సులభంగా ఉందని, నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టాలని తెలిపారు. పోడు భూములకు సంబంధించి సర్వే జరిగినప్పటికీ, పట్టా పాసు పుస్తకాలు రాని సాగుదారులకు తక్షణమే రీసర్వే నిర్మవహించి పట్టాలివ్వాలని అన్నారు. లేని పక్ష్యంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గోకినపల్లి ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు కంగాల కల్లయ్య, మండల నాయకులు కంగాల కన్నయ్య, కారం



రాజులు, ధర్మముల రాంబాబు, సున్నం రామారావు, మడకం ముత్యాలరావు, సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, కంగాల భూలక్ష్మి , ధర్మల శ్రీరాములు, రైతు సోడెం పాల్‌రాజు, తెల్లం సత్యం, సోడెం లక్ష్మడు, కణితి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయానికి రూ.2.25కోట్లు మంజూరు



**ప్రజాపక్షం/ముదిగొండ:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క చొరవతో ముదిగొండ మండల నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.25కోట్లు నిధులు జీఓఆర్‌టీ నం.375 ఉత్తర్వులు జారీతో మంజూరు చేసింది. సొంత భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన భవనం నిర్మించనున్నారు. ఈ నిర్మాణ పనులు తెలంగాణ హౌసింగ్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ కార్యాలయానికి నిధులు మంజూరు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రికి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# కొమ్మేపల్లిలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) సత్తుపల్లి ఏరియా యాజమాన్యం ఆధ్వర్యంలో బుధవారం కొమ్మేపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని యూపీఎస్ పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్మేపల్లి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ వైద్య శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు, చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని జిఎం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# భవన నిర్మాణ కార్మిక సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/పెనుబల్లి:** భవన నిర్మాణ కార్మిక సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు డిమాండ్ చేశారు.స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ముందు భవన నిర్మాణ కార్మికులు సిఐటియు పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి స్థానిక ఎమ్మార్వో వీరభద్ర నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ లో ఉన్న వెల్ఫేర్ బోర్డు దరఖాస్తులను తక్షణమే పరిష్కారం చేయాలని, ఇల్లు లేని నిరుపేదలైన భవన నిర్మాణ కార్మికులకు ఇల్లు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, 55 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు 6000 పెన్షన్స్ సౌకర్యాన్ని కల్పించాలని, గత శాసనసభ సమావేశాల్లో నిర్ణయించిన ప్రకారం భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్ ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గాయం తిరపతి రావు, రైతు సంఘం మండలాధ్యక్షుడు చిట్టి మొదల కృష్ణయ్య, సిఐటియు మండల కన్వీనర్ గుడిమెట్ల బాబు, చీపి వెంకటేశ్వరరావు, చందు, జి.వెంకటేశ్వరరావు, చెన్నారావు, గోపి, శీను, తడికమళ్ళ చిరంజీవి, కంటే సత్యం తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారించాలని కోరుతూ తహశీల్దార్ పి. సత్యనారాయణకు సత్తుపల్లి సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించకుండా వెల్ఫేర్ బోర్డు ద్వారానే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నెం.12ను రద్దు చేసి, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని, రెన్యువల్ కాని కార్మికుల లేబర్ కార్డులను తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కావూరు వెంకటేశ్వరరావు, రమేష్, లక్ష్మ ణ్, నరసింహారావు, మారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి విత్తనాలు పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్లు రైతువేదికలో అధిక పత్తి ఉత్పాదకత పథకం కింద పత్తి విత్తనాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం సతీష్ మాట్లాడుతూ...రైతులు అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసి, అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అలాగే శాస్త్రీయ సాగు పద్ధతులు, సమతుల్య ఎరువుల వినియోగం, చీడపీడల సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని అవగాహన కల్పించారు. తక్కువ ఎత్తు, కొన్ని కొమ్మలు మాత్రమే ఉండే ప్రత్యేక మాత్రమే హైబ్రిడ్లు వాడాలన్నారు. మొక్కల శాఖీయ పెరుగుదలను సరైన సమయంలో నియంత్రించడం ద్వారా, మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండటం వలన సాధారణం కన్నా 2,3క్వింటాల అధిక దిగుబడి సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోటి శ్రీనివాసరావు, ఎఫ్‌టీసీ సహాయ వ్యవసాయ సంచాలకులు బి. వాణి, ఎఫ్‌టీసీ వ్యవసాయ అధికారి శరత్‌బాబు, ఉద్యానవశాఖ అధికారి శరత్‌బాబు, ఉద్యానవ శాఖ అధికారిని అపర్ణ, ఎంపిడీఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి తిలక్ కిషోర్, ఏఈఓలు పాల్గొన్నారు.

# ఘనంగా పదవీ విరమణ సన్మానం



**ప్రజాపక్షం/తల్లాడ:** మండల పరిధిలోని వెంగన్నపేట ప్రాథమికోన్నత పాఠశాల సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తించిన కోటగిరి రాధ మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల నరసింహారావు అధ్యక్షతన ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ మేరకు ముఖ్య అతిథిగా ఎంఈఓ దామోదర ప్రసాద్ హాజరై గత 30ళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా అందించిన సేవలను కొనియాడారు. విరమణ అనంతరం తను శేషాజీవితం ఆయురారోగ్యాలతో, ఆనందం, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నూతనకల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రమేశ్, తాతా భాస్కర్‌రావు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంజాన్, పీఆర్‌టీయూ నాయకులు రాయల నరసింహారావు, ఉంగరాల వెంకటేశ్వర్లు, అద్దంకి గోపాలకృష్ణ, గ్రామ పెద్దలు, రాజకీయ నాయకులు, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గోలియాకు నివాళి



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండలంలోని అప్పాయిగూడెం గ్రామ పంచాయితీ భిక్యతండాకు చెందిన జెగోలియా మృతి చెందడంతో గ్రామ పంచాయితీ సర్పంచ్ దండు ప్రవీణ్ వారి నివాసానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా దండు ప్రవీణ్ అంత్యక్రియల ఖర్చుల కోసం రూ 5వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. అలాగే వైరా ఎంఎల్‌ఏ ప్రధాన అనుచరుడు ఎస్ఎన్ నాయక్, ఎంఎల్‌ఏ సూచన మేరకు దశ దిన కార్యక్రమం కోసం 75 కిలోల బియ్యం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జేవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ నందు 202627 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డా. చీపు పూర్ణచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఓపెన్ యూనివర్సిటీలో చేరదలచిన విద్యార్థులు ఇంటర్, ఐటిఐ, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, డిప్లమా లో ఉత్తీర్ణులైన వారు అర్హులని ఆయన అన్నారు. ఎస్టి, కోయ, చెంచు,గోండు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లకు యూనివర్సిటీ ఉచిత డిగ్రీ విద్యను అందజేయనున్నట్లు తెలిపారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సర చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజును ఆగస్టు 7వ తేదీలోపు చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాల కొరకు 9491881910 8187837058 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# ఆటోను ఢీకొట్టిన లారీ..ఆటో డ్రైవర్ మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రోడ్డు ప్రమాదలంలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని గొల్లగూడెం వద్ద ఖమ్మం,వరంగల్ ప్రధాన రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నేలకొండపల్లి మండలం ఆచర్లగూడేనికి చెందిన కొలికపూడి రవితేజ ఖమ్మం నుంచి గొల్లగూడెం వైపు ఆటోలో వెలుతున్నాడు. ఈ క్రమంలో వరంగల్ వైపు నుంచి ఖమ్మం దిశగా వస్తున్న లారీ ఆటోను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందారు. అలాగే అతివేగంతో లారీ అక్కడి పొలాల్లోకి దూసుకుపోయింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై మృతుని తల్లి జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రితకి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ ముష్కరాజు తెలిపారు.

## యూరియా యాప్ రద్దు చేసి రైతులకు ఎరువులు అందించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** యూరియా పంపిణీలో అమలు చేస్తున్న మొబైల్ యాప్‌ను వెంటనే రద్దు చేసి, రైతులకు యూరియా ఎరువులు కొరత లేకుండా అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయుకేఎస్)డివిజన్ కార్యదర్శి గుగులోతు నాయక్ డిమాండ్ చేశారు. మంగళ వారం ఏఐయుకేఎస్ సింగరేణి మండల కమిటీ ఆధ్వ ర్యంలో తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో పట్టాలు లేని రైతులకు కూడా యూరియా, ఎరు వులు అందించాలని, నకిలీ విత్తనాలు, పురుగుమందులను అరికట్టాలని కోరారు. అనం తరం గుగులోత్ నాయక్ మాట్లాడుతూ యూరియా యాప్ వల్ల గ్రామీణ రైతులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటలకు కనీస మద్దతు ధర అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐయుకేఎస్ నాయ కులు కోడెం సీతారాములు, పాయం రవి, గొగ్గిల రాము, ముక్తి రామారావు, గుమ్మడి ప్రసాద్, దోమల రమేష్, చింత విష్ణు, గొగ్గిల సమ్మయ్య, గొగ్గిల రామారావు, పుల్లకాని సత్తి రెడ్డి, రావుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## వెల్ఫేర్ బోర్డు పథకాలు కార్మికులకే వర్తింపజేయాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దని, భవన నిర్మాణ కార్మాకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐ టీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యా లయంలో ముందు జరిగిన నిరసన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ అన్ని వెల్ఫేర్ బోర్డు పథకాలు నిజమైన భవన నిర్మాణ కార్మి కులకే వర్తింపజేయాలని, అర్హత లేని వారి ఇన్సూరెన్స్ కార్డులు రద్దు చేయాలని కోరారు. 55 ఏళ్లు పైబడిన కార్మికులకు నెలకు రూ 6వేల పెన్షన్, సహజ మరణ బీమా రూ 5లక్ష లకు పెంపు, పెండింగ్ క్లెయిమ్‌ల విడుదల, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి డిమాండ్లు చేశారు. అలాగే కార్మికుల కోసం మండల కేంద్రంలో విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సూరం పుల్లారావు, ఓరుగంటి శ్రీను, నాయకులు హలావత్ శివ, పోక్కిలి దానియేలు, ఎస్‌కే మాస్తాన్, సంగు శ్రీను, మోటా వెంకటేశ్వర్లు, భూక్యా బద్రు, గుర్రం అశోక్, మడివి మల్లేష్, మందా శ్రీను, కొడిమే వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/మణుగూరు:** పినపాక నియోజక వర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మణు గూరు మండలం శివలింగపురంలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వసతులు, అవసరమైన వైద్య పరికరాలు, మందుల నిల్వ, సిబ్బంది (స్టాఫ్) కొరత తదితర అంశాలపై వైద్యాధికారులు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజ లకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారు లకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, మైనారిటీ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తిరు హృదయ పండుగ

### -ప్రేమ, కరుణ, క్షమాపణలకు ప్రతీక : ఫాదర్ జేసు ప్రసాద్



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల కేంద్రంలో అపొస్తులులు పునీత పేతురు పౌలు దేవాలయంలో యేసు పవిత్ర తిరు హృ దయ పండుగ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్సిఎం దేవాలయం విచారణ గురువు, తిరు హృదయ సభ ఆధ్యాత్మిక నాయకుడు ఫాదర్ సిద్దెల జేసు ప్రసాద్ ఎస్సిజే మాట్లాడుతూ యేసు పవిత్ర హృదయం ప్రేమ, కరుణ, జాలి, క్షమాణలకు ప్రతీక అని తెలిపారు. ఆ సందేశాన్ని జీవితంలో అనుసరించి కుటుంబాలు ప్రేమ, ఐక్యతతో జీవించాలని పిలుపుని చ్చారు. పండుగలో భాగంగా మండల కేంద్రంలో, ఆళ్లపల్లి, మర్కోడు, జిన్నెలగూడెం గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక ర్యాలీ నిర్వహించారు. అనంతరం దివ్యబలి పూజలో పాల్గొని ఆధ్యాత్మిక సందేశం స్వీకరించారు. ఈకార్యక్రమంలో సిస్టర్ ప్రశాంత, సిస్టర్ జీవనాంద, సిస్టర్ డామరీస్, జ్యోతిర్మయి యానిమేటర్ పరమ ప్రభాకర్, ఉపదేశి కిరణ్, సంఘ నాయకులు కండె రామ్మూర్తి, కరకపల్లి నాగేశ్వరరావుతో పాటు క్రైస్తవ భక్తులు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సేవ్ మణుగూరు పేరుతో మణుగూరు పట్టణ బంద్ విజయవంతం




**ప్రజాపక్షం/మణుగూరు:** సేవ్ మణుగూరు పేరుతో మణుగూరు అఖి లపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు మణుగూరు పట్టణ బంద్ విజయ వంతం జరిగిందని అఖిలపక్ష పార్టీల నాయకులు తెలిపారు. ముందుగా మణుగూరు పట్టణంలో అఖిలపక్ష పార్టీల నాయకులు ప్రద ర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన సమావే శంలో దుర్గ్యాల సుధాకర్ (సిపిఐ), వాసిరెడ్డి చలపతిరావు (టిడిపి), రూపురెడ్డి మధుసూదన్ రెడ్డి సిపిఐ (ఎంఎల్ మాస్ లైన్) నాయకులు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి మణుగూరు పీకే ఓసి డిప్ సైడ్ బ్లాక్ ను ప్రైవేట్ పరం చేయకుండా సింగరేణికి కేటాయించాలని, మణుగూరు ఓసీ ఎక్స్టెన్షన్ తీసుకురావాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీలు కార్మిక సంఘాలు ఇచ్చిన బందు విజయవంతం జరిగిందని, ఇప్పటికైనా సింగరేణి సంస్థ గుర్తించి ఓసి టు డిసైడ్ బ్లాక్ ను సింగరేణి అప్పచెప్పాలని, డిమాండ్ చేశారు. 1974 సంవత్సరంలో మణుగూ రులో పీకే 1 ఇంక్లైన్ బొగ్గు బావి ప్రారంభించి నాటినుండి పీకే 2, పీకే 3, ఓ సి, ఓ సి 2, ఓసి 3 ఓ సి 4 లు విస్తరించి సింగరేణి సంస్థ అభి వృద్ధికి బాటలు వేస్తూ అనేక వేల మందిసింగరేణి కార్మికులు తో మణు గూరు పట్టణం విరాజిల్లిందని, మణుగూరు సింగరేణి మీదనే ఆధార పడి పట్టణ అభివృద్ధి, వ్యాపారాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇలా ఒకదానిమట ఒకటి అభివృద్ధి చెందుతూ ఉన్నాయి అన్నారు. నేడు సింగరేణి మణుగూరులో కేవలం రెండు బావులే నడుస్తున్నాయని పీకే ఓసి డిప్ సైడ్ బ్లాక్ ను ప్రవేట్ పరం చేయకుండా సింగరేణికే అప్ప చెప్పాలని, మణుగూరు ఓసి అనుమతులు తీసుకురావాలని, అప్పుడే సింగరేణి కార్మికులు ప్రాంత అభివృద్ధి జరుగుతుందని డిప్ సైడ్ బ్లాక్ ను ప్రవేట్ పరం చేస్తే ఉన్నటువంటి కార్మికులను ఇతర ప్రాంతాలకు తరలిస్తే, ఈ ప్రాంత అభివృద్ధి ప్రశ్నార్ధకమవుతుందని ఈ ప్రాంతంలో సింగరేణికి ఇంకా 25 సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నా యని అధికారులు చెబుతున్నారని, బొగ్గు అత్యధికంగా ఈ జిల్లాలో ఉండడం వలన రాష్ట్ర ప్రభుత్వం మణుగూరు ప్రాంతంలో బిటిపిఎస్ నిర్మాణం కూడా చేపట్టిందని కానీ సింగరేణి వారు ఉన్నవాటికి అను మంతులు తీసుకురాలేక, ఉన్న బొగ్గు భావాలను ప్రైవేటుపరం చేయడా నికి చూస్తుందని, దీనిని అడ్డుకోవాలని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటుపరం కానివ్వమన్నారు. దీనిలో భాగంగా పికే ఓసి డిప్ సైడ్ బ్లాక్ ను ప్రైవేట్ పరంకు ప్రయత్నం అని అందుకే కార్మిక సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు కలుపుకొని సేవ్ మణుగూరు పేరుతో జరుగుతున్నటువంటి ఈ ఆందోళనకు సహకరించినచాంబర్ ఆఫ్ కామర్స్ వర్తక, వ్యాపారస్తులు, బులియన్ మర్చంట్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్, జన రల్ స్టోర్ అసోసియేషన్, కిరాణా స్టోర్ అసోసియేషన్, కూరగాయల మార్కెట్ అసోసియేషన్, ఫ్యాన్సీ జనరల్ స్టోర్ అసోసియేషన్, చికెన్ అండ్ మటన్ మార్కెట్ అసోసియేషన్, విద్యాసంస్థలు, హోటల్స్, పట్టణ పుర ప్రముఖులు అన్ని వర్గాల ప్రజలు సహకరించి బందు విజ యవంతం చేశారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ పట్టణ బంద్ తో పాటు సంఘీభావంగా పి.వీ .కాలనీలో కూడా అన్ని షాపులు స్వచ్ఛం దంగా బంద్ నిర్వహించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సుజాత, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, తోట రమేష్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇమామ్ ఉద్దీన్, తేనేటి నారాయణ, ఎస్‌డి. ఉమర్, కొత్తపల్లి సీతారాములు, బోశెట్టి సంపత్, ఎస్ కే సర్వర్, ఎస్వీ నాయుడు, ఆధర్ల రాములు చిక్కుల శివ, కన్నెబోయిన ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు మండల ప్రధాన కార్యదర్శి మద్దెల భద్రయ్య, పట్టణ అధ్యక్షులు తాటి పూర్ణచంద్రరావు, రాజా, ఆంజనే యులు, జంపాల యాకయ్య సిపిఐ (ఎంఎల్ మాస్ లైన్ ) మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందులో ఎంఎల్ఏ కోరం విస్తృత పర్యటన

**-ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం**
**-ఇంటింటికీ ఫారాల పంపిణీ**
**-ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం, పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ**



**ప్రజాపక్షం/ఇల్లందు:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య మండలంలోని తిలక్‌నగర్, పొలారం, కొమరారం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. మొదట తిలక్‌నగర్, పొలారం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ)ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం బీఎల్‌వోలు, బీఎల్ఏలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఎన్నికల సంఘం అందిస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు పంపిణీ చేస్తూ, వాటి ప్రాముఖ్యత, పూరించే విధానంపై అవగాహన కల్పించారు. ప్రతి ఓటరు తప్పని సరిగా ఫారాలను సక్రమంగా నింపి సమర్పించాలని సూచించారు. తదుపరి కొమరారం గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, లబ్దిదారులు భూక్యా ప్రవళిక, కోరం రమాదేవి కుటుంబాలతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని ఎంఎల్ఏ పేర్కొన్నారు. అనంతరం కొమ రారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఎ ల్ఏ వైద్య సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది పనితీరును పరిశీలిం చారు. వర్షాకాలంలో సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆసుపత్రిలో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచా లని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, మండల కాంగ్రెస్ అధ్య క్షుడు మండల రాంమహేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎట్టి హరికృష్ణ, సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షురాలు పాయం స్వాతి, తిలక్‌నగర్ సర్పంచ్ ధనసరి స్రవంతి రాజు, పొలారం ఉపసర్పంచ్ ధారావత్ చంద్రశేఖర్, సర్పంచులు వల్లాల మంగమ్మ, పూనెం సురేందర్, మూతి కృష్ణ, తాటి బిక్షం, కల్తీ పద్మ, తారాచంద్, పాయం కృష్ణప్రసాద్, కాకటి భార్గవ్, మోడెం సంపత్, చెన్నూరి కృష్ణ, ప్రసన్న కుమార్, వీరా నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మూడో మహా సభలను విజయవంతం చేయండి




**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ మండల కేంద్రంలో జూలై 18, 19వ, తేదీలలో జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మూడవ మహా సభలను విజయవంతం చేయాలని ఆసంఘం ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు ముత్యాల విశ్వనాథం పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యా లయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశం సోందె కుటుంబరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావులే కుండా పక్కా ప్రణాళికతో నాయకత్వం సమన్వయంతో పని చేయాలని సూచించారు. మహా సభల సందర్భంగా జరిగే బహిరంగ సభకు వేలా దిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పులుపునిచ్చారు. ఈ సమా వేశంలో జిల్లా తెలంగాణ గిరిజన సమాఖ్య (టిజిఎస్) ప్రధాన కార్య దర్శి భూక్యా శ్రీనివాస్, జిల్లా నిర్మాణ బాధ్యులు కల్లూరి వెంకటేశ్వర్లు, ఆహ్వాన సంఘం కోశాధికారి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఏఐఎంసి డైరెక్టర్ వాడె లక్ష్మి, నాయకులు వైఎస్ గిరి, ఏఐకేఎస్ కౌన్సిల్ సభ్యులు కొంకా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**-ఆహార నాణ్యత, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**-నాణ్యత లోపాలు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు**
**-కలెక్టర్ అంకిత్**





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల మరియు కళాశాల, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలను సందర్శించి కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులను పరిశీలించారు. ఏడో, ఎనిమిదో తరగతి విద్యార్థిను లతో మాట్లాడి వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, వసతి, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. పాఠశాలలో నూతనంగా చేరిన విద్యా ర్థుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి నుల ఔటింగ్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, బాలికలను తల్లిదండ్రులు లేదా అధికారికంగా అనుమతించిన సంరక్షకులతో మాత్రమే బయ టకు పంపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం కిచెన్ షెడ్‌ను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన సరు కులను పరిశీలించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. ప్లాంట్ మరమ్మతులు ఆలస్యమవుతున్న కారణాలను అడిగి తెలుసుకుని, వెంటనే మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశా లను తనిఖీ చేసిన కలెక్టర్, పాఠశాలలో నమోదైన విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సందర్భంగా పప్పు పలుచగా ఉండ టంతో పాటు నాణ్యత లోపించిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా ర్థులకు వడ్డించే ఆహారం పరిశుభ్రంగా, పోషక విలువలతో, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. తాను మళ్లీ ఆక స్మికంగా తనిఖీ చేస్తానని, ఆహార నాణ్యతలో లోపాలు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరి శుభ్రమైన వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని అన్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. తాగునీరు, పరిశు భ్రత, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రమా ణాల పెంపుతో పాటు వారి ఆరోగ్యం, సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాఠశాలల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్ది విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు మరింత విశ్వాసం కలిగేలా విద్యా ప్రమా ణాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, పోషకాహార నాణ్యతను మరింత మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవి, ఎంఈఓ జుంకీ లాల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, లక్ష్మి నరసయ్య, ఉపాధ్యా యులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదానికి గురైన మిత్రుడికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** చదువుకునే రోజుల్లో పుస్తకాలు పంచుకున్న స్నేహం, కష్ట కాలంలో కన్నీళ్లు తుడిచే బంధంగా మారింది. గత వారం కల్లూరు షుగర్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయ పడిన తమ చిన్ననాటి మిత్రుడు గార్లపాటి నరసింహారావు (జీఎన్ఆర్) కు 10వ తరగతి 1997 1998 బ్యాచ్ సహచరులు ప్రేమతో అండగా నిలిచి మానవత్వాన్ని చాటారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం చిన్న హరిజనవాడకు చెందిన గార్ల పాటి నరసింహారావు ద్విచక్ర వాహనంపై విజయవాడ వెళ్లి వస్తుండగా, కల్లూరు షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నరసింహారావును 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మిత్రబృందం వెంటనే 10వ తరగతి వాట్సాప్ గ్రూప్ ఒక్కటైంది. మనోడు కిందపడితే మనం చూస్తూ ఉండలేం అంటూ ఒక్కొక్కరూ తమకు తోచిన సాయం చేశారు. ఎవరికీ చెప్పకుండా, ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా కేవలం 24 గంటల్లోనే రూ.94,000 జమ చేశారు. ఈ మొత్తాన్ని మిత్రులం దరూ కలిసి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న నర సింహారావుకు స్వయంగా అందజేశారు. డబ్బు ఇవ్వడం కాదు, మేమున్నాం అనే ధైర్యం ఇవ్వడం ముఖ్యం అని మిత్ర బృందం తెలిపింది. బాల్యంలో కలిసి తిన్న త్రాగిన గోళీ సోడా రుచి, కలిసి కొట్టిన ఆడిన ఆటల గాయాలు ఇప్పటికీ మధురమేనని, ఆ స్నేహమే ఇప్పుడు ఆప దలో ఆదుకునేలా చేసిందని వా రు భావోద్వేగానికి గురయ్యారు. నర సింహారావు త్వరగా కోలుకొని మళ్లీ మామూలు మనిషి కావాలని, మరలా అందరితో కలిసి నవ్వాలని మిత్రబృందం మనసారా కోరుకుం టోంది అని ఆకాంక్షించా రు. ఈ కార్యక్రమంలో నేలాల చక్రవర్తి, నేలాల నరసింహారావు, పోటుగాడు నరసింహారావు, చాపల మడుగు నరసింహారావు, ఇల్లంగి రాంబాబు, ప్రస్తుతపూర్ రామకృష్ణ, ఎలబాక శంకరాచారి, ఉష్కిల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజు మణుగూరు ఏరియా సింగరేణి అధికారుల నిరాహార దీక్ష




**ప్రజాపక్షం/మణుగూరు:** కోల్ ఇండియాలో అమలవుతున్న పే అప్‌గ్రే డేషన్‌ను సింగరేణిలో కూడా వెంటనే అమలు చేయాలని, అలాగే గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీ ఆర్‌పీ) ను తక్షణమే విడుదల చేయాలని ప్రధాన డిమాండ్లతో మణు గూరు ఏరియా సింగరేణి అధికారులు చేపట్టిన నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. మణుగూరు ఏరియాలోని సుమారు 180 మంది అధికారులు ఒక్కతాటిపైకి వచ్చి అత్యంత ఉత్సాహంగా ఈ నిరాహార దీక్షలో పాల్గొంటున్నారు. అధికారుల ఐక్యత, పోరాటస్ఫూర్తి ఈ ఉద్య మానికి మరింత బలం చేకూరుస్తోంది.నిన్న జరిగిన తొలి రోజు నిరా హార దీక్షకు ఏఐటియూసి, ఐఎన్‌టీయూసి, టిజిబికెఎస్ కార్మిక సంఘాల నాయకులు, యూనియన్ డెలిగేట్లు శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం, మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు సింగ రేణి యాజమాన్యం మరియు తెలంగాణ ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకుని అధికారుల న్యాయబద్ధమైన, చట్టబద్ధమైన డిమాండ్లను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని కోరారు. నిరాహార దీక్ష రెండో రోజు వరుణ్ కుమార్, సురేష్ కుమార్, యాస శ్రీనివాస్, కె. నరేష్ కుమార్, పి. నగేష్ కుమార్, శ్రీకాంత్, యుగేందర్, వినోద్ కుమార్, జమ్మి రాజేష్, కేశవరావు, శివప్రసాద్ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. మణుగూరు ఏరియాలోని మిగతా అధికారులు దీక్షా శిబిరానికి చేరు కుని వారికి సంఘీభావం తెలియజేస్తూ ఉద్యమ విజయానికి తమ పూర్తి మద్దతును ప్రకటించారు.

## పదవీ విరమణ కార్మికులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఐటీసీ కర్మాగా రంలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విర మణ పొందిన కప్పెర వెంకట రమణరావు, జి చంద్రశేఖర్‌రావు, ఎస్ సువర్ణరాజులకు ఐఎన్ టీయూసీ మిత్రపక్షాల ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు గోనె రామారావు, ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి, కార్య వర్గ సభ్యులు, నాయకులు పదవీ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా గోనె రామారావు, పిచ్చిరెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి, కార్మిక సంక్షేమానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి అనుభవం, క్రమ శిక్షణ ఉద్యోగులకు ఆదర్శమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో ఆనం దంగా జీవించాలని ఆకాంక్షించారు.

## యూరియా యాప్ రద్దు చేసి రైతు సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/దమ్మపేట :** రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, యూరియా యాప్‌ను రద్దు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం డిమాండ్ చేసింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకురాలు తోడం దుర్గమ్మ, ఏఐయుకేఎస్ డివిజన్ అధ్యక్షుడు పందూరి వీరబాబు మాట్లాడుతూ రైతు లకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందడం లేదని, యూరియా యాప్ కారణంగా ఇబ్బందులు పెరిగాయని విమర్శించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి సబ్సిడీ ఎరువులు అందించాలని, రైతు భరోసా, పెండింగ్ ధాన్యం బిల్లులు, బోనస్ వెంటనే చెల్లించాలని, పంటలకు ఎంఎస్‌పీ చట్టబద్ధ హామీ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి కురసం ముత్యాల రావు, ఏఐయుకేఎస్ మండల అధ్యక్షుడు కుంజా కాంతారావు, నాయకులు పూజల సంజీ వరావు, భద్రం, సున్నం జగన్, శీలం రాంబాబు, గంగాధర నాగమణి, కుప్పాల నాగరాజు, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు ఎన్యూమరేషన్ ప్రక్రియ పరిశీలన



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** మండలంలోని పెద్దనల్లబల్లి(పోలింగ్ కేంద్రం నెంబర్ 100), చిన్నబండిరేవు (పోలింగ్ కేంద్రం నెంబర్ 98) ప్రాంతాల్లో జరుగుతున్న ఓటరు ఎన్యూమరేషన్ ప్రక్రియను డిప్యూటీ కలెక్టర్ మురళి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌వోలు)నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, ఓటరు ఫారాల పంపిణీ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా సవ రణ కార్యక్రమం సజావుగా, పారదర్శకంగా సాగుతున్నదీ లేదా అనే విషయాన్ని ఆయన సమీక్షించారు. ఓటరు జాబితా తయారీలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరిని తప్పని సరిగా నమోదు చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహిస్తూ అర్హులందరికీ ఓటు హక్కు కల్పిం చేలా క్షేత్రస్థాయిలో మరింత శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబం ధిత బీఎల్‌వోలు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికల పాఠశాలను సందర్శించిన ఆడిటర్



**ప్రజాపక్షం/ఏన్కూరు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఏర్పాటు చేసిన సోషల్ ఆడిటర్ చైతన్యకు మార్ మంగళవారం సందర్శించారు. ఈసంద ర్భంగా ఆయన పాఠశాల వసతులు, వంటగది, తరగతి గదులు, త్రాగునీటి తదితర సమస్యలపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మాని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు వరకు ఈ తనిఖీలు ప్రతి పాఠశాలలో జరుగుతాయని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల శాతాన్ని మరింత పెంచాలన్నారు. ఈకార్యక్రమంలో సిఆర్పి భూక్య లచ్చిరాం ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు చంద్రిక, నిర్మల, చైతన్య, సత్య వతి, లత, నాగమణి, సదా కోన్, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల పరిధిలోని మూల పోచారం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను మంగళవారం వైరా గిరిజన సంక్షేమ సహాయ అధికారి(ఏటీడీవో)పి రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం మెనూ అమలు తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాల శుభ్రత, స్టోర్ రూమ్‌లో నిత్యవసర సరుకుల నిల్వ, స్టాక్ రిజిస్టర్, పాఠ శాల రికార్డులను పూర్తిగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి నాగరాజు, డిప్యూటీ వార్డెన్ డిఎస్ నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వానాకాలం సాగుకు యూరియా కొరత లేదు



**-యూరియాకు ప్రత్యామ్నాంగా నానో యూరియా వాడాలి**
**-కలెక్టర్ దివాకర టిఎస్**

**ప్రజాపక్షం/చింతకాని :** జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లలో , సేల్ పాయింట్లలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికా బద్దంగా పర్యవేక్షణ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వెల్లడించారు. మంగళవారం చింతకాని మండలం నాగులవంచ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గిడ్డంగులు , విక్రయ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్ ను నిల్వల వివరాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. యూరియా బుకింగ్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా రైతుల మొబైల్ ఫోన్‌లో పరిశీలన చేసి యాప్ వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంటల సాగుకు అవసరమైన మేరకే రైతులు యూరియా కొనుగోలు చేయాలని వానాకాలం సీజన్ కు సరిపడా యూరియా నిల్వలు జిల్లాలో ఉన్నాయన్నారు. యాప్ వల్ల రైతులకు నష్టం లేదని, గత రబీ సీజన్‌లో కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా అమలు చేయడం జరిగిందన్నారు. రైతులు యూరియా కు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలన్నారు. నానో యూరియా వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రైతులు పంట అవసరం మేరకు మాత్రమే మోతాదుకు మించకుండా ఎరువులు క్రిమిసంహారక మందులు వినియోగించే విధంగా వ్యవసాయ అధికారులు , శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీడీవో చంచు శ్రీనివాసరావు, సహకార సంఘం అధ్యక్షులు నల్లమోతు శేషగిరి, సిఈవో శ్రీనివాసరావు, సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

# వైరా శాఖ గ్రంథాలయాన్ని సందర్శించిన ఖాదర్ బాబా



**ప్రజాపక్షం/వైరా:** జిల్లా గ్రంథాలయ సంస్థ ఖమ్మం చైర్మన్ ఎండి.ఖాదర్‌బాబా వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ని మర్యాదపూర్వకంగా కలిసి వైరా శాఖ గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణం కోసం రూ.80లక్షలు మంజూరు చేసినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నూతన గ్రంథాలయం భవనం నిర్మాణంతో వైరా ప్రాంత విద్యార్థులు, యువత, పాఠకులకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన గ్రంథాలయ సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ ఖమ్మం చైర్మన్ ఎండి.ఖాదర్‌బాబా, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, జిల్లా కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, పమ్మి అశోక్, పాలేటి నర్సింహారావులతో కలిసి వైరా శాఖ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పాఠకులు, విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ గ్రంథాలయానికి మున్సిపల్ త్రాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించగా, జిల్లా గ్రంథాలయ సంస్థ ఖమ్మం చైర్మన్ ఎండి.ఖాదర్‌బాబా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైరా శాఖ గ్రంథాలయాన్ని ఆదర్శవంతమైన గ్రంథాలయంగా తీర్చిదిద్ది, విద్యార్థులు, యువతకు మెరుగైన అధ్యయన వాతావరణాన్ని కల్పించేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని చైర్మన్ ఎండి.ఖాదర్‌బాబా తెలిపారు.

# 5న ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

**మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని స్వర్గీయ సూర్యదేవర నాగేశ్వరరావు అన్నపూర్ణమ్మ దంపతుల కుమారులు సూర్యదేవర వెంకటకృష్ణారావు, సూర్యదేవర శ్రీమంతు వ్యవసాయ క్షేత్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జులై3 నుండి 5వ తారీఖు వరకు ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 3వ తారీఖు మంగళవాయిద్యాలతో తోరణముల కట్టుట, గోపూజ, గణపతి పూజ, పుణ్యావచనం, రక్ష బంధనం, దీక్ష ధారణ, అఖండ దీప స్థాపన, అంకురార్పణ, జులై4వ తారీఖున మూలమంత్ర, సూర్య నమస్కారములు, ఏకాదశి రుద్రాభిషేకము, జలాధివాసము, స్నానములు, తదితర కార్యక్రమాలు నిర్వహణ, జులై5వ తారీఖున గణపతి పూజ, గోకుంబా జ్వాలా, దిష్టి దర్శనము, దేవాలయ బలిహరణ, మహాపూర్ణ హంతి, తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. 5వ తారీఖు ఆదివారం ఉదయం 11.30 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట అనంతరం ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని దర్శించుకోవాలని ఆలయ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర వెంకటకృష్ణారావు, సూర్యదేవర వాగ్దేవి, తీర్ధం రామక్రిష్ణ, కారుకొండ నరేష్, మాచర్ల శంకర్, వెంకటక్రిష్ణ(చిన్ని) తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నేతలు అభివృద్ధిపై చర్చకు రావాలి

**-మంత్రి శ్రీనివాసరెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు**
**-స్థానిక సంస్థల ఎన్నికలతో బీఆర్ఎస్ కనుమరుగు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బీఆర్ఎస్ నేతలకు పాలేరు అభివృద్ధి కనిపించటం లేదని, బహిరంగ చర్చకు సిద్ధం కావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొడాలి గోవిందరావు సవాల్ విసిరారు. మండల కేంద్రం లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ తాతా మధు అభివృద్ధిని చూసి తట్టుకోలేక మంత్రి శ్రీనివాసరెడ్డి పై అవాకులు, చెవాకులు పేలుతున్నారన్నారు. సొంత మండలం లోనే హద్దులు తెలియని నాయకులు మంత్రి పై విమర్శలు చేయటం సిగ్గుచేటు అన్నారు. పాలేరు లో కనివిని ఎరగని రీతిలో అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతుంటే జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ కనుమరుగు కావటం ఖాయమని పేర్కొన్నారు. వెన్నుపోటు రాజకీయాలు చేసింది ఎవరో ప్రజలకు తెలుసున్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాలేరు ఎప్పటికీ కాంగ్రెస్ కంచుకోట అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, రాయపూడి నవీన్, దోసపాటి శేఖర్, చిలకబత్తిని వీరబాబు, కైలాసపువెంకటేష్, కడియాల నరేష్, సర్పంచ్ లు కట్టెకోల నాగార్జున, కుక్కల నరేష్ పాల్గొన్నారు.

## 15కల్లా సీతారామ ద్వారా నీరు విడుదల చేయాలి



**ప్రజాపక్షం/తల్లాడ:** ఈనెల 15వ తేదీ నాటికి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేయాలని మంగళవారం తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ అధ్యక్షుడు నల్లమోతు మోహనరావు మాట్లాడుతూ..సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరు అందిస్తే సుమారు 20వేల ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలు సాగుచేసే అవకాశం ఉంటుందన్నారు. సంబంధిత శాఖ అధికారులు నీటి విడుదల తేదీని ప్రకటించి, వరి సాగుపై రైతుల్లో ఉన్న సందిగ్ధతను తొలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, పులి వెంకటనర్సయ్య, భూమా శ్రీనివాసరావు, ఆలస్యం బుచ్చయ్య, ఆలస్యం విజయ్, రావూరి అప్పారావు, అద్దంకి ఏసు, వెల్పుల కృష్ణయ్య, కారుమంచి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సభ్యులు బాబు మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెం సిపిఐ శాఖ సభ్యులు కర్రి బాబు (60) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. మృతి వార్త తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ వారి స్వగృహంలో ఉంచిన బాబు మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ వారి కుటుంబం పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమంలో భాగస్వాములయ్యారన్నారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాయకుడు బుడిగె వెంకన్న, రావుల సంజీవరావు, ఎస్‌కె మీరా, పొట్ట ప్రసాద్, జొన్నలగడ్డ వెంకన్న, కర్రి వెంకటి, ఉపేందర్ తదితరులు నివాళులర్పించారు.

## తహశీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయాలు వెల వెల



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని తహశీల్దార్ మరియు సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాలు గత రెండు రోజులుగా భూభారతి కొరకు సైట్ ఓపెన్ కాకపోతే రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. కల్లూరు మండల పరిధిలోని తల్లాడ, కల్లూరు మండలాల ప్రజలు సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం వద్ద ప్రతిరోజూ సుమారు 20 రిజిస్ట్రేషన్లు చేయించుకుంటారు. అదేవిధంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద భూభారతిలో రైతులు పలు రకాల రిజిస్ట్రేషన్లు చేయించుకుంటారు. అమ్మకందారులు కొనుగోలుదారులు మొత్తం తహశీల్దార్ కార్యాలయంలో పదిమంది ఆన్లైన్ చేయించుకుంటారు దీంతో ప్రభుత్వానికి లభిస్తున్న ఆదాయం కూడా నిలిచిపోవడంతో గత రెండు రోజులుగా కార్యాలయాలు వెల వెల పోతున్నాయి. రద్దీగా ఉండే కార్యాలయాలు సైట్ ఓపెన్ కాకపోవడం వలన ఆన్లైన్ చేసుకునే వారు లేనందున ప్రభుత్వానికి కూడా ఆదాయం తగ్గిపోయింది. ఈ విషయమై సబ్ రిజిస్టర్ కార్యాలయంలో, తహశీల్దార్ కార్యాలయంలో అధికారులను వివరణ కోరగా రాష్ట్రవ్యాప్తంగా సైటు ఓపెన్ కావడం లేదని తెలిపారు.

## ఉచిత శిక్షణ ఏర్పాట్లను పరిశీలించిన జారే

**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** మండల కేంద్రంలో త్వరలో నిర్వహించనున్న ఉచిత ఉపాధి ఉద్యోగ శిక్షణ కార్యక్రమాల ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఐటీడీఏ భద్రాచలం వారు నిర్వహించే ఉద్యోగ శిక్షణ కార్యక్రమాలు యువతకు నాణ్యమైన శిక్షణ అందించి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల వసతిగృహాన్ని ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికియ అవసరమైన నిధులు కేటాయించి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## బోల్తాపడ్డ చేపల వ్యాను

**-ఇద్దరికి గాయాలు**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** చేపల లోడుతో వెళుతున్న వ్యాను బోల్తాపడటంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పెనుబల్లి మండల పరిధి లోని టేకి శివారు లోని జాతీయ రహదారిపై మంగళవారం విశాఖపట్నం నుండి పూణెకి పచ్చి చేపల లోడుతో వెళుతున్న అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ బోల్తా పడింది. ఎదురుగా వెళుతున్న ట్రాక్టర్ ని ఢీకొట్టడంతో అదుపుతప్పి బోల్తాపడడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వ్యాను డ్రైవర్ కి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో సత్తుపల్లికి చెందిన అశోక్ లేలాండ్ వ్యాను ముందు భాగం ధ్వంసం కాగా సత్తుపల్లి కి చెందిన వ్యాను యజమాని డ్రైవర్ బోడపాటి సుధీర్, మరో యువకుడు కనకాల అశోక్ ప్రాణాలతో బయటపడ్డారు. వియ్యం బంజర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## నాగేశ్వరరావును పరామర్శించిన ముద్రగడ వంశీ

**ప్రజాపక్షం/ఇల్లందు:** ముదిగొండ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఖమ్మంలోని మమత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలుగుదేశం నాయకుడు బాసాని నాగేశ్వరరావును ఇల్లందు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ, విజయలక్ష్మీ నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరగా, ప్రాణాపాయం తప్పిందని, త్వరలో కోలుకుంటారని వైద్యులు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన నాయకులు, నారా లోకేష్‌తో ఫోన్‌లో మాట్లాడే ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు గోగేలా రాజేష్, శ్యామ్ పాదిలా, నాని పాల్గొన్నారు.

# గోదుమ వాగు వంతెనపై మరమ్మతులు ముమ్మరం చేయాలి



**- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి**
**- మేయర్ మూడ్ గణేష్**

**ప్రజాపక్షం/భద్రాది కొత్తగూడెం :** పట్టణ పరిధిలోని రామవరం గోదుమ వాగు వంతెనపై ఏర్పడిన గుంతల మరమ్మత్తులు ముమ్మరంగా సాగుతున్నాయని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. రామవరం గోదుమ వాగు వంతెనపై గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో పాటు తరుచూ ప్రమాదాలు చోటు చేసుకోవడంతో మున్సిపల్ శాఖ ద్వారా మరమ్మత్తు పనులకు ఆదేశించారు. ఈ మేరక్ మేయర్ మంగళవారం జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జిపై పెద్దెత్తున గుంతలు ఏర్పడి నిత్యం ప్రయాణికులు నరక యాతన పడుతున్నారని, నేషనల్ హై అధికారులు తీవ్ర నిర్లక్ష్యం కారణంగా అనేక ప్రమాదాలు చోటు చేసుంటున్నాయని చెప్పారు. ఏండ్ల తరబడి ఈ దుస్థితి నెలకొనడం వల్లే తాము రంగంలోకి దిగామన్నారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపదికన ఈ మరమ్మత్తు పనులకు ఆదేశించామని స్పష్టం చేశారు. వాహన దారులకు ఇకపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు అత్యంత నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని ఇబ్బడి సిబ్బందిని ఆదేశించారు. మేయర్ వెంట కార్పొరేటర్లు బోయిన విజయ్ కుమార్, కూరపాటి సుధాకర్, జి వెంకటేశ్వర్లు, నాయకులు ఎండి యూసఫ్, ధర్మ రాజు, పి సత్యనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ, అంకితభావానికి ప్రతిరూపం అన్నా సులోచన..




**- జడ్పీ సీఈఓ నాగలక్ష్మి**

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** క్రమశిక్షణ, అంకితభావానికి ప్రతిరూపం అన్నా సులోచన అని జిల్లా పరిషత్ సీఈఓ నాగలక్ష్మి అన్నారు. మంగళవారం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ పంచాయతీ కార్యాలయం ప్రక్కన ఉన్న శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో చుంచుపల్లి ఎంపీపీ కార్యాలయ సూపరింటెండెంట్ రువ్వా అన్నా సులోచన ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. చుంచుపల్లి యంపీడీఓ సుభాషిని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విషిష్ట అతిథి జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, అతిథులు సిడిపిఓ స్వర్ణలత లెనీనా, లక్ష్మీ దేవిపల్లి యంపీడీఓ సుష్మిత, విద్యానగర్ కాలనీ ఉప సర్పంచ్, సిపిఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి ఆధ్వర్యంలో ఏసుబాబు అన్నా సులోచన దంపతులకు శాలువలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం జడ్పీ సీఈఓ నాగలక్ష్మి మాట్లాడుతూ అన్నా సులోచన తన సుధీర్ఘ ఉద్యోగ జీవతంలో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. స్వతహాగా మృదు స్వభావి, ఉద్యోగ పర్వంలో రిమార్క్ లేని వ్యక్తిగా నిలిచారని అన్నారు. తను ఎక్కువ కాలం డిప్యూటేషన్‌పై ఖమ్మం జడ్పీ కార్యాలయంలో విధులు నిర్వర్తించినా, తన చివరి పనిదినాలు మన జిల్లాలో ఎంపీపీ చుంచుపల్లిలో విధులు నిర్వర్తించినా, ఎక్కడ కూడా తన పై అధికారులకు మాట రాకుండా ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆమె సేవలను అధికారులు, ఉద్యోగులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. అన్నా సులోచన పెద్దన్న జాన్సన్ మాట్లాడుతూ మా కుటుంబంలో 3వ సంతానం పుట్టి పల్లెటూర్లో ఎటువంటి వసతులు లేని సమయంలో ఎంతో కష్టపడి విద్యాభ్యాసం పూర్తి చేసుకొని తన ఈ స్థాయికి ఎదగడానికి ఎన్నో ఇబ్బందులను అధిగమించి, శ్రమకోర్చి ఈ స్థాయికి ఎదిగిందని అన్నారు. పదవీ విరమణ అనంతరం తన శేష జీవితం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం సహోద్యోగులు అన్నా సులోచనను శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సన్మాన కార్యక్రమంలో చుంచుపల్లి ఎంపీపీ కార్యాలయ సిబ్బంది, అన్ని మండలాల సూపరింటెండెంట్‌లు, మండలంలోని గ్రామ కార్యదర్శులు, బంధువులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇండ్ల సమస్యలపై నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

**- ఇండ్లులేని పట్టణ పేదలు దండుగా కదలిరావాలి**
**- పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఇండ్లు లేని నిరుపేదలందరికీ తక్షణమే ఇండ్ల స్థలాలు కేటాయించాలని, పేదల ఇండ్ల సమస్యల పరిష్కారం కోసం నేడు నిర్వహించే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్లో సిపిఐ కొత్తగూడెం పట్టణ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ పట్టణంలో నిరుపేదలు నిర్మించుకున్న ఇండ్లకు వెంటనే నెంబర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అదే విధంగా పేదల ఇండ్ల అక్రమ కూల్చివేతలను పాలకులు, అధికారులు తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ ప్రధాన డిమాండ్ల సాధనపై సిపిఐ, సిపిఎం, న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా ఉందని తెలిపారు. ఈ పోరాటంలో ఇండ్లు లేని పట్టణ పేదలంతా దండుగా కదలివచ్చిన ధర్నాను జయప్రథం చేయాలని కోరారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తామని, నిరుపేదల హక్కుల సాధన కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు, కార్పొరేటర్లు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, గోపికృష్ణ, ఎండి యూసుఫ్, పిడుగు శ్రీనివాస్, గడ్డం ప్రభాకర్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, పి.సత్యనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

# పత్తి పొలాల్లో రైతుల సందడి



**ప్రజాపక్షం/కరకగూడెం:** తొలకరి పలకరించడంతో రైతన్నలు పులకరించి పోయారు. ఏరువాక పౌర్ణమి అరక కట్టి ఎన్నో ఆశలతో వర్షాకాలం సాగుకు శ్రీకారం చుట్టారు. మండలంలో కురిసిన వర్షంతో పంట భూముల్లో రైతులు, రైతు కూలీల కోలాహలం కనిపించింది. కొందరు రైతులు హలాలు చేతపట్టి పోలాలు దున్నగా మరి కొందరు ఇప్పటికే సిద్ధం చేసిన భూముల్లో అచ్చు తొలి పత్తి విత్తనాలు పెడుతున్నారు. ఇంకొందరు పంటలు వేసేందుకు భూములను శుభ్రం చేస్తున్నారు. పుడమి తల్లికి వర్షాకాలం సీజన్ కళ వచ్చింది. తొలకరి పలకరించిన వేళ మొదలైంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో మండలంలో పలు చోట్ల వర్షం కురిసింది. వ్యవసాయ పనులతో పల్లెల్లో పండగ వాతా వరణం నెలకొంది. పలు వ్యవసాయ క్షేత్రాల్లో పొలం పనులు ఊపందు కున్నాయి. జోరుగా విత్తనాలు వేసే ప్రక్రియ ఆరంభమైంది. మరో రెండు, కొన్ని భారీ వర్షాలు కురిస్తేనే విత్తనాలు వేసుకోవాలని, భూమిలో వేడి తగ్గే వరకు ఆగాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. పత్తి విత్తనాలను మహిళా సంఘం ఆధ్వర్యంలో సంఘం దుర్గం స్వాతి, జాడి సరిత, దుర్గం గౌరమ్మ, రామటంకి అపర్ణ, దుర్గం సమ్మక్క, జాడి సింధు, జిమ్మిడి పందు, ఆటపాలతో పత్తి గింజనలను విత్తారు.

# సీజనల్ వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలకు శ్రీకారం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం, సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధి, 1వ వార్డులో గల ప్రభుత్వ ఏరియా 100 పడకల ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సమితి సింగారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ జెసిబి మిషన్ ద్వారా శుభ్రం చేయిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం రవి, వత్సవాయి కొండబాబు, శ్రీనివాస్, భద్రయ్య, రాంబాబు, అశోక్ నగర్ యూత్ సభ్యులు నిఖిల్ చారి, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ళ గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం మున్సిపాలిటీ పరిధిలోని పీకే1 సెంటర్‌లో విఠల్‌రావు నగర్‌కు చెందిన లబ్ధిదారులు పిట్టల లక్ష్మి నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై, గృహప్రవేశ వేడుకలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, మైనారిటీ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ ఫార్మర్‌లో రాగి తీగలు చోరీ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** మండలంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ లో రాగి తీగలు చోరీ కి పాల్పడ్డారు. బాధిత రైతుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని పైనంపల్లి గ్రామానికి చెందిన రైతుల పొలాలలో మంగళవారం గుర్తు తెలియని దుండగలు రెండు ట్రాన్స్ ఫార్మర్ల ను పగలగొట్టి అందులో ఉన్న రాగి తీగలను చోరి చేశారు. బాధిత రైతులు స్థానిక పోలీస్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రైతులు సమాచారం మేరకు చోరీ జరిగిన విద్యుత్ మోటార్లు ను క్షేత్ర స్థాయిలో నేలకొండపల్లి విద్యుత్ సంస్థ ఏఈ జీ.రవి పరిశీలించారు. రైతుల ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు అప్రమతంగా ఉండాలని సూచించారు. అనుమానితులు ఉంటే తమ సిబ్బంది సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది హనుమంతరావు, వెంకటేశ్వర్లు లు ఉన్నారు.

# రెతు సంక్షేమ ప్రభుత్వం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. మండల కేంద్రం లోని రైతు వేదిక లో రైతు భరోసా కార్యక్రమం ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి నిధులు విడుదల చేయగానే, చప్పట్లు ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. రైతు భరోసా తో రైతులకు అండగా నిలుస్తుందన్నారు.ప్రభుత్వం రైతు ను రాజు ను చేసేందుకు అనేక పథకాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. రాయితీలు, ప్రోత్సాహకాలు రైతులు అందుకుని వ్యవసాయం లో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం రైతులకు పత్తి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్పి, రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య, రైతు ప్రతినిధులు కొడాలి గోవిందరావు, యం.వెంకన్న, బొందయ్య, కడియాల నరేష్, ఆయా పంచాయతీ సర్పంచ్ లు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన సిపిఎం శిక్షణ తరగతులు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పార్టీ నిర్మాణంలో ఐక్యత ఉన్నప్పుడే సిపిఐ (ఎం) బలం మరింత పెరుగు తుందని ఆ పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ స్పష్టం చేశారు. నేలకొండపల్లి లోని శ్రీకర గార్డెన్స్ (పోతనబోయిన పెరుమాళ్ళు ప్రాంగణం) లో మూడు రోజుల పాటు నిర్వహించిన పాలేరు డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారంతో విజయవంతంగా ముగిశాయి. చివరి రోజు పార్టీ నిర్మా ణం అనే అంశంపై బండి రమేష్ క్లాస్ బోధిస్తూ, ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో కమ్యూనిస్టులను దెబ్బతీసేందుకు అనేక శక్తులు ప్రయత్నిస్తున్నాయని, వాటన్నింటినీ తట్టుకొని ప్రజల పక్షాన నిలబడటమే గొప్ప విషయమన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే సిపిఐ (ఎం) లో పనిచేయడం గర్వకారణమని, పాలేరు డివిజన్‌లో మిలిటెంట్ ఉద్యమాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ కర్తవ్యాలు అనే అంశంపై జిల్లా కమిటీ సభ్యు లు షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ, విద్య, వైద్య రంగాలు మరియు ప్రజా సంక్షేమం కోసం రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేయాలన్నారు. శిక్షణ తరగతుల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఏటుకూరి రామారావు మాట్లాడుతూ, ఈ మూడు రోజుల్లో నేర్చుకున్న రాజకీయ అంశాలతో గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. తరగతుల నిర్వహణకు సహకరించిన దాతలకు, వాలంటీర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన గొడవర్తి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, బొంతు రాంబాబు, నంద్ర ప్రసాద్, కొమ్ము శ్రీను, సుదర్శన్ రెడ్డి, మల్లెల సన్మంతరావు, వివిధ మండలాల కార్యదర్శులు, డివిజన్ నాయకులు మరియు ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

# సంక్షేమ వసతి గృహాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు

## -భవనాల మరమ్మతులు : కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సంక్షేమ వసతి గృహాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమం, గిరిజన, బిసి, మైనార్టీ, సంక్షేమ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, డార్మెంటరీ, ఫర్నీచర్ తదితర విషయాలపై ప్రత్యేక శ్రద్ధవహించాలని కలెక్టర్ సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైతే భవనాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రతి విద్యా సంస్థకు జీరో విద్యుత్ బిల్లు వచ్చేలా విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో పాఠశాలలను మెరుగ్గా తీర్చిదిద్దినట్లు వసతి గృహాల మరమ్మతులకు నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవడంతో పాటు మరుగుదొడ్లు, తలుపులు, కిటికిల మరమ్మతులు చేపట్టాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు దగ్గరలోని సంక్షేమ హాస్టళ్లను మ్యాపింగ్ చేయాలని, వసతి గృహాల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత బదిలీల కొరకు వచ్చిన దరఖాస్తులను మిగులు సీట్లలో భర్తీ చేయాలన్నారు. సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, వివిధ శాఖల అధికారులు జి. జ్యోతి, డిడి విజయలక్ష్మి, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన అంగులతో పాత గుట్టబడి భవనం పనులు

## అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట
## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం
## ప్రభుత్వ భూమిని సర్వే చేయాలంటూ ఆదేశం





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ఉన్న ఎంపిడివో కార్యాలయం ప్రక్కన ఉన్న ఉపాధిహామీ పథకం భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్ పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సారథ్యంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఒక దృక్పథంతో పట్టుదలతో ఉన్నట్లు తెలిపారు. మధిర తాలూకా సమయంలో బ్లాక్ డవలప్‌మెంట్ ఆఫీస్‌ను వైరా నుండి తరలించిన తర్వాత భవనాన్ని గుట్టబడిగా మార్చడం జరిగింది. అప్పటి పెద్దలు బొర్రా భద్రయ్య, చింతనిప్పు వేల్పాద్రి మరికొంతమంది పెద్దలు విద్యాభివృద్ధి కోసం గుట్ట బడిని అందరు సహకారంతో కలిసి ఏర్పాటు చేశారు. అప్పట్లో వైరాలో రెండు బడులు ఉన్నాయి. ఒకటి ప్రాథమిక పాఠశాల, రెండు గుట్ట బడి అని వారు తెలిపారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క 1972 నుండి 75 వరకు గుట్ట బడిలోనే విద్యను అభ్యసించడం జరిగింది. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్‌తో పాటు పలువురు పెద్దలు గుట్ట బడిలోనే విద్యను అభ్యసించారు. గుట్టబడి చుట్టూ పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన వాటిని గుర్తించి వారికి ప్రత్యామ్నాయంగా స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మించడం జరుగుతుందని తెలిపారు. వైరా పట్టణం గుర్తుండి పోయే విధంగా ఈ ప్రాంతం అభివృద్ధి జరుగుతుంది అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, 13వ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ సీతారాములు, జిల్లా కాంగ్రెస్ మెడికల్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాలాజీనాయక్, పుంద్రు శ్యామ్‌బాబు, రంగా జనార్ధన్, పమ్మి అశోక్, వేల్పుల మురళి, వైవి.నాగేశ్వరరావు, శ్రీకాంత్, తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ రెండు ఎకరాలకే..

## -విడతల వారీగా మొత్తం భూమికి.. -రైతు భరోసా విడుదల చేసిన సిఎం

**ప్రజాపక్షం/ఖమ్మం :** వర్షాకాలం పంటకు సంబంధించి రైతు భరోసాను మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. తొలి దశలో రెండు ఎకరాలు ఉన్న రైతుల ఖాతాల్లో ఎకరాకు ఆరువేల చొప్పున జమ చేశారు. మొత్తం 73 లక్షల మందికి విడతల వారీగా మొత్తం జమ చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఖమ్మం జిల్లాలో రెండుఎకరాలు కలిగిన 2,23,910 మంది రైతులకు గాను రూ.127.57 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించి 9,111,27 మంది రైతులకు గాను రూ. 61.43 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఎనిమిదవ తేదీ నాటికి పూర్తి స్థాయిలో రైతు భరోసాను జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# అథ్లెటిక్స్ అంతర్జాతీయస్థాయిలో రాణించాలి

## - ఎంఎల్‌సి కూనంనేని



**ప్రజాపక్షం/పాల్వంచ :** జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారులు నైపుణ్యం కలిగిన కోచ్‌ల వద్ద శిక్షణ తీసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. ఇటీవలి రోజుల్లో బెంగళూరులో వరల్డ్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన లెవల్ వన్ అథ్లెటిక్స్ కోచ్ శిక్షణలో మెరుగైన ప్రతిభ కనభరిచి లెవల్ వన్ కోచ్‌గా అర్హత సాధించిన కోచ్ నాగేంద్రను ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు మంగళవారం అభినందించారు. వరల్డ్ అథ్లెటిక్స్ నిర్వహించే కోచింగ్ కోర్సుల ద్వారా కోచ్‌లు తమ సాంకేతికతను, నైపుణ్యాలను మరింత మెరుగుపరచుకొని క్రీడాకారులకు శాస్త్రీయ శిక్షణ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్, కేటిపిఎస్ ఏడిఈ తోకల రాందాస్, పిడి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# కపాస్ ద్వారా ఉచిత విత్తనాలు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా కపాస్ కాంతి పథకం ద్వారా అధిక సాంద్రత, దగ్గర సాలు పద్ధతిలో పత్తిని సాగు చేసేందుకు ఉచితంగా పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. వ్యవసాయ అధికారి కొంగర వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ డివిజన్ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వరరావు విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల పంట ఒకేసారి పక్వానికి వస్తుందని ఎకరాకు అధిక సంఖ్యలో మొక్కలు ఉండడంతో దిగుబడి గణనీయంగా పెరుగుతుందన్నారు. చలికాలంలో వచ్చే గులాబీ రంగు, పచ్చపురుగు ఉధృతిని కూడా ఈ విధానం ద్వారా తగ్గించవచ్చునని ఆయన సూచించారు. శాస్త్రీయ పద్ధతుల్లో పత్తి సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, పలువురు సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో బెట్టింగ్.. వ్యక్తి అదృశ్యం

**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండలం నాచారం గ్రామానికి చెందిన మిద్దె సత్యనారాయణ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో భారీగా డబ్బు కోల్పోయి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం సత్యనారాయణ జీఓఈఎక్స్‌ఈహెచ్9.కామ్ అనే వెబ్ సైట్ బెట్టింగ్ యాప్‌లో సుమారు రూ 3,50,000 పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. ఈ విషయం కుటుంబానికి తెలిసితే గొడవలు జరుగుతాయని భయపడి, మానసిక ఆందోళనకు గురై ఆయన, వ్యక్తిగత ఖర్చుల కోసం రూ 50,000 నగదు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఈ ఘటనపై ఆయన కుమారుడు మిద్దె మణికంటేశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

# దుమ్ముగూడెంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పరిశీలన



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం గ్రామ పంచాయితీలో వర్క్‌షాప్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 108వ వార్డు పరిధిలో ఈఎఫ్ ఫారాల సేకరణ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కెల్లా శేఖర్ పరిశీలించారు. అర్హులైన ప్రతి ఓటరు తప్పని సరిగా ఫారాలు పూర్తి చేసి సంబంధిత అధికారులకు సమర్పించాలని ఆయన సూచించారు. వివరాలు సక్రమంగా నమోదు చేస్తూ ఓటు హక్కు తొలగింపు సమస్యలు ఉండవని తెలిపారు. అలాగే కొత్తగా అర్హులైన వారు కూడా తమ పేర్లు నమోదు చేసుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి నరేష్, గ్రామ పంచాయితీ సిబ్బంది లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

# పాత గుడిని తీయవద్దని ఎమ్మెల్యేకు వినతి



**ప్రజాపక్షం/వైరా:** మా గుడి మాకు కావాలి, పాత గుడి తరలించవద్దు అని మంగళవారం వైరా మున్సిపాలిటీ 1,2,3 వార్డులకు చెందిన ప్రజలు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ను, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ తమ ప్రాంత ప్రజలు సుమారు 150 సంవత్సరాలుగా ముత్యాలమ్మకు పూజలు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు కొందరు వ్యక్తులు ముత్యాలమ్మ దేవాలయాన్ని మరో ప్రాంతానికి మార్చుట కొరకు ప్రయత్నాలు చేపడుతున్నారని తక్షణమే అటువంటి వారిపై చర్యలు తీసుకొని తరలించకుండా చూడాలని వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ కు సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

# విద్యుత్ కార్యాలయ స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రక్కన విద్యుత్ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని మంగళవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మార్కెట్ చైర్మన్ గంగారావు, జిల్లా కాంగ్రెస్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, విద్యుత్‌శాఖ ఎస్ఈ, డిఈ, ఏడి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పమ్మి అశోక్, ఏదునూరు సీతారాములు, వీరంశెట్టి సీతారాములు, పుంద్రు శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియో విజయవంతం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** పల్స్ పోలియో కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల మొత్తం 1,719 మంది పిల్లలను లక్ష్యంగా తీసుకుని విజయవంతంగా నిర్వహించినట్లు ఆళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యులు తరుణ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 15 బూత్ టీములు, 2 రూట్ సూపర్వైజర్లు, 1మొబైల్ టీమ్, 39 మంది ఆశా కార్యకర్తల సహకారంతో చేపట్టగా, 99శాతం కవరేట్ సాధించినట్లు తెలిపారు. ఇంటి వద్ద అందుబాటులో లేని కొంత మంది పిల్లలకు కూడా వారు ఉన్న ప్రాంతాల్లోనే పోలియో చుక్కలు ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# నకిలీ విత్తనాలు, పురుగు మందుల విక్రయాలు అరికట్టాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** నకిలీ పురుగు మందుల విక్రయాలను అరికట్టి, యూరియా యాప్‌ను రద్దు చేసి, రైతు భరోసా సకాలంలో చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు కల్లూరి కిషోర్ అన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ దారా ప్రసాద్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. అనంతరం కిషోర్ మాట్లాడుతూ యాప్‌తో సంబంధం లేకుండా గతంలో మాదిరిగా యూరియా, డీఏపి, కాంప్లెక్స్ తదితర ఎరువుల ధరలను తగ్గించి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయబారపు వెంకటేశ్వర్లు, గోనెల రమేష్, వేల్పుల రమేష్, కుంజా భాస్కర్, నరేష్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.